నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 25 ఏప్రిల్ 2024 | NIZAMABAD

# అమ్మాయిలు అదుర్స్..
## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ఖలీల్‌వాడి/కామారెడ్డి, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ఇందూరు బాలికలు సత్తాచాటారు. బుధవారం ఇంటర్ బోర్డు ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదల చేయగా నిజామాబాద్ జిల్లా బాలికలు పైచేయి సాధించారు. సెకండియర్‌లో 60 శాతం ఉత్తీర్ణులైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. గతేడాది సెకండియర్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ సంవత్సరం కూడా 60 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. అలాగే ఫస్టియర్‌లో 51 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 50 శాతం ఉత్తీర్ణత సాధించారు.గతేడాది సెకండియర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 26వ స్థానంలో ఉండగా ఈసారి 29వ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఫస్టియర్ ఫలితాల్లో 25వ స్థానంలో ఉండగా ఈసారి 27వ స్థానంలో ఉందన్నారు.



### అట్టడుగు స్థానంలో కామారెడ్డి జిల్లా

ఇంటర్ ఫలితాల్లో కామారెడ్డి జిల్లా చివరి స్థానంలో నిలిచింది. గతంలో కన్నా తక్కువగా ఉత్తీర్ణత శాతం నమోదైంది. జిల్లాలో ఫస్టియర్‌లో 34.81శాతం, సెకండియర్‌లో 44.21 శాతం మంది పాసైనట్లు కామారెడ్డి ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

**ప్రథమ సంవత్సరం**

| | కామారెడ్డి ఉత్తీర్ణత 34.81 % | | | నిజామాబాద్ ఉత్తీర్ణత 50 % | | |
|---|---|---|---|---|---|---|
| | శాతం | మొత్తం | పాసైనవారు | శాతం | మొత్తం | పాసైనవారు |
| బాలికలు | 44.18% | 3873 | 1711 | 60.5% | 8076 | 4892 |
| బాలురు | 25.23% | 3785 | 955 | 37% | 6898 | 2587 |

**ద్వితీయ సంవత్సరం**

| | కామారెడ్డి ఉత్తీర్ణత 44.21 % | | | నిజామాబాద్ ఉత్తీర్ణత 60% | | |
|---|---|---|---|---|---|---|
| | శాతం | మొత్తం | పాసైనవారు | శాతం | మొత్తం | పాసైనవారు |
| బాలికలు | 53.9 % | 3703 | 1996 | 67% | 7671 | 5183 |
| బాలురు | 34.21% | 3531 | 1208 | 50% | 6317 | 3152 |

- 2019 ఎన్నికల్లో బాండ్ పేపర్ నాటకం
- ఇప్పుడు మోదీ ప్రకటనతో మాయాజాలం
- పసుపు రైతుకు మరోసారి నయవంచన
- వచ్చేసిందంటూ నమ్మిస్తున్న బీజేపీ ఎంపీ
- అతీగతీలేని పసుపు బోర్డు ఏర్పాటు ప్రక్రియ
- లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి సంతరించుకున్న ప్రాధాన్యత



# బోర్డు పేరిట ఇంద్రజాలం

నిజామాబాద్, ఏప్రిల్ 24, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) పసుపు బోర్డు పేరిట బీజేపీ ఎంపీ అర్వింద్ ప్రకటనలు ఇంద్రజాలాన్ని తలపిస్తున్నాయి. ఉన్నది లేనట్లు... లేనిది ఉన్నట్లుగా చిత్రీకరించడపై రైతులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అతీగతి లేని పసుపు బోర్డు ప్రక్రియను రాజకీయంగా వాడుకునేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టకుండా.. కేవలం సోషల్ మీడియా ప్రకటనలకే పరిమితమైన అర్వింద్‌కు ప్రస్తుత ఎన్నికలు సవాల్‌గా మారాయి.

పసుపు బోర్డుపై నాడు బాండ్ పేపర్ నాటకమాడిన అర్వింద్.. నేడు ప్రధాని మోదీ చేసిన ప్రకటనతో బూటకమాడుతున్నాడు. ఐదు రోజుల్లోనే పసుపు బోర్డును తెస్తానని, 2019లో బాండ్ పేపర్ రాసిచ్చి గట్టెక్కాడు. బోర్డు గురించి ప్రశ్నిస్తే వంకర సమాధానాలతో తప్పించుకొని తిరిగాడు. పైగా రైతులపై రాజకీయ ముద్రవేసి తిట్ల దండకం అందుకున్నాడు. పసుపు బోర్డు ఏర్పాటు జరిగిపోయిందంటూ మరోసారి రైతులను వంచనకు గురి చేస్తున్నాడు. అక్టోబర్‌లో నిజామాబాద్, మహబూబ్‌నగర్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీనే స్వయంగా పసుపు బోర్డు ప్రకటన చేయగా, ఇప్పటి వరకు దాని ఊసెత్తకపోవడంపై రైతుల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నది.

### మరోసారి నయవంచన...

గత ఎన్నికల్లో గెలిచాక అర్వింద్.. పసుపు బోర్డును అటకెక్కించాడు. పూటకో మాట మాట్లాడుతూ రైతులను గందరగోళంలో పడేశాడు. బోర్డు ఇవ్వబోమంటూ కేంద్రం స్పష్టం చేశాక కొత్త పల్లవిని అందుకున్నాడు. ఎక్స్‌టెన్షన్ ఆఫీస్‌ను చూపిస్తూ ఇదే పసుపు బోర్డు అన్నట్లు మభ్యపెట్టాడు. ఈ కార్యాలయంతో రైతులకు ఇసుమంతైనా లాభం జరుగలేదు. రెండేండ్ల నుంచి పసుపు పంటకు తెగుళ్లు పట్టి పీడిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. మూడేండ్లుగా పసుపు సాగు విస్తీర్ణం భారీగా తగ్గుముఖం పడుతున్నా.. రైతులకు ప్రోత్సాహం అందించిన దాఖలాలు లేవు. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు మరోసారి మోదీనే స్వయంగా పసుపు బోర్డు ప్రకటన చేయడంతో అంతా నిజమేనని నమ్మారు. కానీ సీన్ కట్ చేస్తే ఎన్నికల కోడ్..! అంతకుముందే చిత్తశుద్ధితో బోర్డు ప్రక్రియను వేగవంతం చేయకపోవడంపై రైతులు మళ్లీ ఆలోచనలో పడ్డారు. ఎన్నికల తర్వాత పుసుపు బోర్డును అటకెక్కించే అవకాశమూ లేకపోలేదని అంటున్నారు.



గత ఎన్నికల్లో పసుపుబోర్డు ఏర్పాటుపై అర్వింద్ రాసిచ్చిన బాండ్ పేపర్

### భారీ గేమ్ ప్లాన్..

ఈ ఏడాది ఆర్మూర్, డొంకేశ్వర్, నందిపేట, ఆలూర్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ మండలాల పరిధిలో సాగుచేసిన పసుపు పంటకు దుంపకుళ్లు, మర్రి ఆకు తెగుళ్లు సోకి రైతులను ఇబ్బంది పెట్టాయి. దిగుబడిని దెబ్బతీసే తెగుళ్ల నివారణకు రైతులు చేయని ప్రయోగం లేదు. ఇదిలా ఉండగా స్పైసెస్ బోర్డు ఎక్స్‌టెన్షన్ కార్యాలయం సిబ్బంది మాత్రం రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలూ ఇవ్వలేదు. పంటలో కొత్త పరిశోధనలు దేవుడెరుగు.. తెగుళ్లపై కనీసం అప్రమత్తం చేయలేదు. దీంతో ఎక్స్‌టెన్షన్ కార్యాలయంతో ఉపయోగమేంటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రధాని మోదీనే స్పైసెస్ బోర్డు ప్రకటన చేసినా ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కాలేదు. నవంబర్‌లో శ్రీకారం చుట్టినా ఎప్పటికి ఏర్పాటు చేస్తారనే విషయంపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇదంతా చూస్తుంటే మళ్లీ ఇది రాజకీయ ఇంద్రజాలమని అంటున్నారు. రూపాయి ఖర్చు లేకుండా హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే పసుపు బోర్డును పెట్టి మమ అనిపించేలా బీజేపీ భారీ గేమ్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.







కామారెడ్డిలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన జనం

# కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మన బతుకులు మార్చే ఒకేఒక్క నాయకుడు కేసీఆర్
- మాచారెడ్డి, కామారెడ్డి రోడ్‌షోలో మాజీ స్పీకర్ పోచారం



రోడ్‌షోలో మాట్లాడుతున్న పోచారం, ప్రచార రథంపై గాలి అనిల్ కుమార్,గంప గోవర్ధన్

మాచారెడ్డి/కామారెడ్డి, ఏప్రిల్ 24 : అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి, వంద రోజుల్లో అన్ని గ్యారెంటీలను అమలు చేస్తామని, అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు మద్దతుగా కామారెడ్డి పట్టణంతోపాటు మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో బుధవారం నిర్వహించిన రోడ్ షోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాసంగి పెట్టుబడి సాయం డబ్బులు రైతులకు ఇప్పటిదాకా అందలేదన్నారు. అడిగితే చెప్పుతో కొడతామంటూ రైతులను కాంగ్రెస్ నేతలు అవమాన పర్చారని గుర్తుచేశారు. 4 వేల రూపాయల ఫించన్ ఏమయ్యిందని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నాట్లు వేసే ముందే రైతుబంధు ఇచ్చామని, ధాన్యం కొన్న వారం రోజుల్లో రైతుల బ్యాంక్ అకౌంట్లలో డబ్బులను జమచేశామని అన్నారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారమే ఫించన్లను పెంచి పంపిణీ చేశామని, మన బతుకులు మార్చే ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని అన్నారు. పదేండ్లు ఎంపీగా ఉన్న బీబీపాటిల్ కామారెడ్డికి రూపాయి కూడా తేలేదని, ఎంపీ నిధులను కూడా వెనక్కి పంపారని అన్నారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే, అందులో ఒక్కటి కూడా కామారెడ్డికి ఇవ్వలేదన్నారు. బీబీ పాటిల్, సురేశ్ శెట్కార్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. అంతకుముందు కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడారు. మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని అన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడికెళ్తే.. అక్కడి దేవుళ్ల మీద ఒట్టేసి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని మయా మాటలు చెబుతున్నాడని అన్నారు. అధికారంలోకి వచ్చి ఐదునెలల గడుస్తున్నా చేయని రుణామాఫీ.. ఆగస్టులో ఎలా చేస్తారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 'పాంచ్ న్యాయ్' హామీలతో ప్రజలకు పంగనామాలు పెట్టడం ఖాయమని అన్నారు. లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే స్కిల్ డెవలప్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరోద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. వర్ని నుంచి బాన్సువాడ, జుక్కల్, జోగిపేట, సంగారెడ్డి మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ లైన్ కోసం అధికారులు మార్కింగ్ ఇచ్చినా అప్పటి ఎంపీలు బీబీ పాటిల్, సురేశ్ శెట్కార్ పట్టించుకోలేదన్నారు. రోడ్‌షో సందర్భంగా మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎంపీపీ నర్సింగ్‌రావు, జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులకు పరిశీలకులను సంప్రదించాలి
### -రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిజామాబాద్ కలెక్టర్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 24 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు, సూచనల కోసం సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్ ఐఏఎస్‌ను సంప్రదించవచ్చని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఆమె ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 11 గంటల మధ్య నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆమెకు నేరుగా లేదా సెల్ నంబర్ 8985340522 ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. వ్యయ పరిశీలకులుగా డీ ఎం నెమ్జీ ఐఆర్‌ఎస్‌ను కేటాయించారని, 898 5341588 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నేరుగా కలిసేందుకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ చెప్పారు.

### ఎన్నికల పరిశీలకులకు కలెక్టర్, సీపీ స్వాగతం ..

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్ బుధవారం ఉదయం నగరానికి చేరుకోగా.. కలెక్టర్‌తోపాటు సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఇతర జిల్లా అధికారులు స్వాగతం పలికారు.

# ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్‌పై అవిశ్వాసం



కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు అవిశ్వాస తీర్మాన కాపీని అందజేస్తున్న కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 24: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణపై పది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ జితేశ్ వీపాటిల్‌కు అందజేశారు. సత్యనారాయణ బుధవారం సంగారెడ్డిలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ఆయనపై పదో వార్డు కౌన్సిలర్ పద్మా శ్రీకాంత్ ఆధ్వర్యంలో పది మంది కౌన్సిలర్లు అవిశ్వా తీర్మానాన్ని ప్రవేశపెట్టి కలెక్టర్‌కు అందజేశారు. పార్టీ మారిన వెంటనే తన పదవికి గండం రావడంపై పట్టణంలో చర్చనీయాంశమైంది. కలెక్టర్‌ను కలిసినవారిలో కౌన్సిలర్లు జంగం నీలకంఠం అప్ప, భూంగారి రాము, ఎరుకల సాయిలు, అల్లం శ్రీను, ముస్త్యాల సుజాత, గాదె విజయలక్ష్మి, సంగని బాలమణి, నునుగొండ భూదేవి, జీనత్ సుల్తానా ఉన్నారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్
### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



దోన్‌పాల్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 24: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. హామీల అమలుపై బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తే పేగులు మెడలేసుకుంట, బొందబెడ్త, కిందపడేసి తొక్కుత, జేబులో కత్తెరపెట్టుకుని తిరుగుతున్నానంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.మోర్తాడ్ మండలం సుంకెట్, దోన్‌పాల్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న ప్రదేశానికి బుధవారం వేముల వెళ్లి కూలీలనుద్దేశించి మాట్లాడారు. కేసీఆర్ ప్రజలకు ఏ హామీ ఇచ్చినా అవి నెరవేర్చారని, చేసేవే చెప్పారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్..120 రోజులు దాటుతున్నా వాటి విషయంలో ఎక్కడ వేసిన అక్కడే గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. రైతు రుణమాఫీ ఇప్పుడు ఆగస్టు 15 అని చెబుతున్నాడని, ఎన్నిసార్లు అబద్ధాలు చెప్పుకుంటూ రైతులను ఆగం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తానని హామీ ఇచ్చాడని, ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీకి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను అక్కడున్న కూలీలకు చూపించారు. అన్ని వర్గాలకు ఆశ చూపించి మోసం చేసి ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు.

### కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలి

గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలని వేముల సూచించారు. సుంకెట్, దోన్‌పాల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వేముల.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు నాయకులను కలిసి ఎంపీ ఎన్నికల ప్రచార సరళి తదితర విషయాలపై దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ , బీజేపీలు ఇచ్చిన అబద్ధపు హామీలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను ప్రజలకు చూపిస్తూ ప్రచారం నిర్వహించాలని సూచించారు.పది గ్రూపులుగా ఏర్పడి ఒక్కో గ్రూపు 50 ఇండ్లకు వెళ్లి ప్రచారం చేయాలన్నారు. వీడియోలే ప్రచార అస్త్రాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరాలని సూచించారు.

### అర్వింద్‌కు గుణపాఠం చెప్పాలి

ఎంపీగా అర్వింద్ సుంకెట్, దోన్‌పాల్ గ్రామాలకు ఒక్కసారి కూడా రాలేదని తెలిపారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్‌పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేసిన అర్వింద్.. ఇప్పుడు తనను కాదని, మోదీ ముఖం చూసి ఓటు వేయాలని కోరడం విడ్డూరమన్నారు. పసుపు బోర్డు, మద్దతు ధర ఇప్పిస్తానని మోసం చేసిన అర్వింద్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పకపోతే ఇంకా ఆగం చేస్తారని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షానా పోరాడుతామని స్పష్టం చేశారు.

# హామీలపై ఎమ్మెల్యేను నిలదీయండి

- మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ
- బీజేపీకి ఎన్నికలు వస్తేనే రాముడు గుర్తుకు వస్తాడు
- సుదర్శన్‌రెడ్డి బెదిరింపులు తట్టుకోలేకే బుద్దె రాజేశ్వర్‌కు గుండెపోటు
- నిజామాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- రెంజల్, నవీపేట, ఎడపల్లిలో ఎన్నికల ప్రచారం

రెంజల్/ ఎడపల్లి, ఏప్రిల్ 24 : గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మాయ మాటలు, అబద్ధపు హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రెంజల్‌మండలం సాటాపూర్, నవీపేట, ఎడపల్లి మండల కేంద్రాల్లో బుధవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తిరగబడతారేమోనన్న భయంతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పోలీసులను వెంటేసుకొని గ్రామాల్లో తిరుగుతున్నాడని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని హామీలు గుప్పించి అధికారం చేజిక్కించుకున్న ఎమ్మెల్యేను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. పార్టీ మారాలంటూ సుదర్శన్‌రెడ్డి బెదిరింపులు తట్టుకోలేకే బోధన్ ఎంపీపీ భర్త బుద్దె రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడని ఆరోపించారు. 420 కాంగ్రెస్ పార్టీ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని సూచించారు. బీజేపీకి ఎన్నికలు వస్తేనే రాముడు, ధర్మం గుర్తుకు వస్తుందని విమర్శించారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకొని సీఎం పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి సిరిఫ్ ఏక్‌సాల్‌కా బాద్‌షా అని పేర్కొన్నారు. ప్రచారంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతీమా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్. పక్కన ఆయేషా, విఠల్‌రావు

# ఆరో రోజు 18 నామినేషన్లు..



బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి తరపున నాల్గో సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న ఆయన కుమారుడు జగన్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 24 : నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి ఆరో రోజైన బుధవారం 18 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నాల్గో సెట్, బీజేపీ నుంచి అర్వింద్ మూడో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. స్వతంత్ర అభ్యర్థి ఆరె రాజేందర్ మూడో సెట్ నామినేషన్ వేశారని, జీ సాయికృష్ణమూర్తి యుగ తులసి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని వివరించారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొండూర్ గంగాధర్, పోతు నవీన్, దేశబోయిన లక్ష్మీనారాయణ, చెంచుట అశోక్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా మొగిలి రాజ్‌కుమార్, పిరమిడ్ పార్టీ ఆ ఫ్ ఇండియా అభ్యర్థిగా పానుగంటి రజితా వాణి, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా పోతు నాగార్జున ఒక్కో సెట్ చొప్పున, స్వతంత్ర అభ్యర్థిగా ముత్యం, రఘు రెండు సెట్ల చొప్పున నామినేషన్లు సమర్పించారని తెలిపారు. ఆలిండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షాహెద్‌ఖాన్ రెండో సెట్ వేశారని వివరించారు. ఇప్పటివరకు 33 మంది అభ్యర్థులు మొత్తం 62 నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి తెలిపారు.